## లంచగాండుల వివరాలు ఎసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఎసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

**డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,**
**మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001**
**ఫోన్: (040) 2475132,**



# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY

తెలుగు దినపత్రిక


## నకిలీ పత్తి విత్తనాల గుట్టురట్టు

తాండూర్ : నకిలీ, అనుమతిలేని పత్తి విత్తనాలు, నిషేదిత గడ్డి మందు లాంటివి ఎవరు విక్రయించినా, వారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడ్డ నకిలీ పత్తి విత్తనాల కేసుకు సంబంధించిన వివరాలను బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు.బోయపల్లి బోర్డు జాతీయ రహదారి సమీపంలో ఆటోలో బెల్లంపల్లి నుంచి తాండూర్ కు నకిలీ పత్తి విత్తనాలను దంపు చేస్తున్నారనే సమాచారంతో తాండూర్ ఎస్సై కే ప్రసాద్, వ్యవసాయాధికారిణి సుష్మా, సిబ్బందితో కలిసి వెళ్లి తనిఖీ చేయగా ఆటోలో నకిలీ పత్తి విత్తనాలు లభ్యమైనట్లు గుర్తించారని తెలిపారు. రూ. 3లక్షలు విలువగల 150 కేజీల పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.భీమిని మండలం నారాయణపూర్ గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేస్తు బోయపల్లి బోర్డు గ్రామంలో ఉంటున్న వూస సుబ్బారావు, తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఒగరి సమ్మయ్య, తాండూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మగ్దూంను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇద్దరు కొనుగోలుదారులు నకిలీ పత్తి విత్తనాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా గుంటుపల్లి శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లు డీసీపీ వివరించారు.గ్రామాల్లో ఎక్కడైనా నకిలీ పత్తి విత్తనాలు ఉన్నట్లుగానీ అమ్ముతున్నట్లుగాని సమాచారం తెలిస్తే తెలియజేయాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సమావేశంలో తాండూర్ సీఐ దేవయ్య, ఎస్సై ప్రసాద్, పోలీసు సిబ్బంది, తాండూర్ మండల వ్యవసాయాధికారిని సుష్మ తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ | సంపుటి:16 | సంచిక:90 | ఎడిటర్: సయ్యద్ పాష | 17-04-2026 శుక్రవారము | పేజీలు :8 | వెల:1/-


## ఘోర రోడ్డుప్రమాదం: ఎనిమిది మంది భక్తులు మృతి



కర్నూలు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లాలో గురువారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందగా, మరో 12 మంది గాయపడ్డారు. మంత్రాలయంమండలం చిలకలదోన గ్రామం సమీపంలో ఒక బొలెరో వాహనం, రెడీ-మిక్స్ లారీని ఎదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. మృతులను కుమార్ (60), దీపిక వీణ (35), సునీల్ (40), బెల్లి (3), పుట్టమ్మ (60), మీనాక్షి (50), తాయమ్మ (60), లోలాక్షిగా గుర్తించారు. ప్రమాదం జరిగినప్పుడు వాహనంలో 16 మంది భక్తులున్నారని బాధితులు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం, ఐదుగురు బాధితులు ఘటనా స్థలంలోనే మరణించగా, మరో ముగ్గురు యెమ్మిగనూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు యమ్మిగనూరు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) ఎన్. భార్గవి తెలిపారు. క్షతగాత్రులను హుటాహుటిన సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితులు కర్ణాటకలోని చిక్‌మగళూరు జిల్లాకు చెందిన యాత్రికులని, శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనం కోసం వారు మంత్రాలయం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని అధికారులు వెల్లడించారు. సంఘటన జరిగిన వెంటనే పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని, సహాయక చర్యలను ప్రారంభించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లును
# రాజకీయ కోణంలో చూడవద్దు



న్యూఢిల్లీ:దేశ రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉంది అని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ వేదికగా నారీ శక్తి వందన్ అధినియం సవరణ బిల్లుపై జరిగిన చర్చలో ప్రధాని మోడీ ప్రసంగించారు. నారీ శక్తి వందన్ అధినియం సవరణ బిల్లు దేశానికి సరికొత్త దశను, దిశను నిర్దేశిస్తుందంటూ ధీమా వ్యక్తం చేశారు. దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకం అని....వారికి తగిన అవకాశం కల్పిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారని ప్రధాని నరేంద్రమోడీ కొనియాడారు. వికసిత్ భారత్ అంటే కేవలం రోడ్లు, రైళ్లు, భవనాలు వంటి మౌలిక సదుపాయాలు మాత్రమే కాదని.. అన్ని వర్గాల, అన్ని రంగాల ప్రజల సమగ్ర అభివృద్ధే అసలైన వికసిత్ భారత్ అని ప్రధాని నరేంద్రమోడీ స్పష్టం చేశారు.మరోవైపు మహిళా బిల్లు రిజర్వేషన్ల బిల్లు వెనుక ప్రధాని నరేంద్రమోడీ, ఎన్డీఏ ప్రభుత్వం స్వార్థం ఉంది అని విపక్షాలు ఆరోపలు చేస్తున్నాయని అవన్నీ ఊహాగానాలు మాత్రమే అని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వెనుక ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు కానీ దురుద్దేశాలు కానీ తమకు లేవు అని చెప్పుకొచ్చారు.ఈ బిల్లు కేవలం దేశ ప్రజల ప్రయోజనం కోసం, దేశ ప్రగతి కోసం తెచ్చిన బిల్లు మాత్రమే అని ప్రధాని నరేంద్రమోడీ వివరణ ఇచ్చారు.ఈ బిల్లును విపక్షాలు వ్యతిరేకిస్తే తనకే లాభం అని మహిళా రిజర్వేషన్ బిల్లుపై తనకు ఎలాంటి క్రెడిట్ అవసరం లేదు అని ప్రధాని నరేంద్రమోడీ సభలో ప్రసంగించారు.పంచాయతీల్లో మహిళా రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు.కానీ లోక్‌సభలో అమలు చేస్తుంటే అడ్డుకుంటున్నారు అని ప్రధాని నరేంద్రమోడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకిస్తే పార్టీలకు రాజకీయ మనుగడ ఉండదు అంటూ ప్రధాని నరేంద్రమోడీ ఘాటు వ్యాఖ్యలు చేశారు.'దేశ చరిత్రలో కొన్ని కీలక ఘట్టాలుంటాయి. ఇది అలాంటి సమయమే. 30 ఏళ్ల క్రితం ఆమోదించాల్సిన బిల్లు...ఇప్పుడు సభ ముందుకు వచ్చింది'అని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు.'మహిళలకు నిర్ణయాధికారం ఉండాలనేదే మా లక్ష్యం. దేశానికి మేం కొత్త దిశను చూపిస్తున్నాం. వికసిత్ భారత్ అంటే కేవలం మౌలిక వసతుల కల్పన కాదు.మహిళలను అందులో భాగస్వాములను చేయడమే లక్ష్యం'అని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు.'మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్టీలన్నీ మద్దతిచ్చాయి. బిల్లుకు మద్దతు ఇచ్చే పార్టీలకే రాజకీయ మనుగడ ఉంటుంది. 30ఏళ్లలో ఇదే రుజువైంది. పంచాయతీల్లో మహిళా రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు.లోక్‌సభలో అమలుచేస్తుంటే అడ్డుకుంటున్నా రు'అని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు.'మహిళల్లో రాజకీయ చైతన్యం బాగా పెరిగింది. పంచాయతీల్లోనే కాదు అత్యున్నత చట్టసభల్లోనూ.. భాగస్వామ్యం కోరుకుంటున్నారు'అంటూ 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని మోడీ కీలక ప్రసంగం చేశారు.

## రాజకీయ ప్రయోజనాలు తప్ప మరేం లేదు



హైదరాబాద్ : మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం వెనుక కేంద్ర ప్రభుత్వానికి రాజకీయ ప్రయోజనాలే తప్ప చిత్తశుద్ధి లేదని కాంగ్రెస్ లోక్‌సభ ఉపనేత గౌరవ్ గొగోయ్ ఘాటుగా విమర్శించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో భాగంగా లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన పాల్గొని, ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. మహిళలకు నిజంగా అధికారం కట్టబెట్టాలనే ఆలోచన ఉంటే, ఎటువంటి నిబంధనలు లేకుండా వెంటనే ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు.గతంలో యూపీఏ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల కోసం చిత్తశుద్ధితో ప్రయత్నించిందని, కానీ ఇప్పుడు కేంద్రం సాకులు వెతుకుతూ కాలయాపన చేస్తోందని గొగోయ్ మండిపడ్డారు. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే రిజర్వేషన్లు అమలులోకి వస్తాయనే మెలిక పెట్టడం ద్వారా మహిళలకు తక్షణమే దక్కాల్సిన హక్కులను ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. ఈ తరహా నిబంధనలు సామాజిక న్యాయానికి విరుద్ధమని, ఇది కేవలం గందరగోళం సృష్టించే ప్రయత్నమేనని ఆయన వ్యాఖ్యానించారు.మహిళా బిల్లులో ఓబీసీ మహిళలకు ప్రత్యేక వాటా కల్పించకపోవడాన్ని గౌరవ్ గొగోయ్ తీవ్రంగా తప్పుబట్టారు. రిజర్వేషన్లలో అన్ని వర్గాల మహిళలకు ప్రాతినిధ్యం ఉన్నప్పుడే అది సమగ్రమైన బిల్లు అనిపించుకుంటుందని స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపట్టడం ద్వారా కొన్ని రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యతను తగ్గించే కుట్ర జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రానికి నారీ శక్తిపై నిజమైన గౌరవం ఉంటే, ఎటువంటి షరతులు లేకుండా రిజర్వేషన్లు అమలు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. దీనిపై విపక్షాల తరపున పార్లమెంట్‌లో తమ పోరాటం కొనసాగుతుందని గొగోయ్ తేల్చి చెప్పారు.

## కఠిన చర్యలు తీసుకోవాలి



హైద్రాబాద్: బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.బెంగళూరు సౌత్ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వ్యాఖ్యలను పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించాలని, అలాగే సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్ విభజనతో పోల్చడం అజ్ఞానమని మంత్రి విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. తేజస్వి సూర్య వ్యాఖ్యలను సమర్థించే వారు మూర్ఖులని తీవ్రంగా విమర్శించిన ఆయన, తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పాటుపై అడ్డగోలుగా మాట్లాడితే ఖబడ్దార్ అని ఘాటుగా హెచ్చరించారు.

# తెలంగాణ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదుగుతోంది



హైదరాబాద్, : అమెరికా 'నేషనల్ వార్ కాలేజ్' బృందంతో మంత్రి శ్రీధర్ బాబు ఈరోజు(గురువారం) సమావేశమయ్యారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని అమెరికా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. డ్రోన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సైబర్ సెక్యూరిటీ రంగాల్లో భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో స్కిల్డ్ వర్క్ ఫోర్స్ సిద్ధంగా ఉందని.. TG-iPASS ద్వారా 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అమెరికాతో దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. టెక్నాలజీ, రీసెర్చ్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో సహకారాన్ని మరింత పెంచాలని మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు.ఏరోస్పేస్ రంగం ఏటా సగటున 30 శాతం వృద్ధి నమోదు చేస్తోంది. ఎగుమతుల్లో 103 శాతం సీఏజీఆర్‌తో తెలంగాణ దూసుకుపోతోంది. రాకెట్ల నుంచి శాటిలైట్ల వరకు అన్ని ఉత్పత్తులపై 'మేడ్ ఇన్ తెలంగాణ' ముద్ర పడుతోంది. ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో తమ కార్యకలాపాలు విస్తరించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 1500కి పైగా ఎంఎస్ఎంఈలతో తెలంగాణ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదుగుతోంది. 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ టాప్ స్థానంలో నిలిచింది. వరుసగా ఐదు సార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును అందుకోవడం తెలంగాణ సాధించిన మరో విజయం.

## యుద్ధం సెగ.. పెరగనున్న మందుల ధరలు?



న్యూఢిల్లీ: పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసును దెబ్బతీస్తున్నాయి. యుద్ధం కారణంగా ముడి పదార్థాల దిగుమతి నిలిచిపోవడం, రవాణా ఖర్చులు భారీగా పెరగడంతో ఫార్మా కంపెనీలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలో మందుల ధరలను పెంచడానికి అనుమతించాలని పలు ఫార్మా సంస్థలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్రం, త్వరలోనే ధరల పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.ముఖ్యంగా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు వాడే మందులతో పాటు ఇతర అత్యవసర మెడిసిన్ ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరిగే ఛాన్స్ ఉంది. ముడి పదార్థాల కొరత వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వస్తోందని కంపెనీలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ కేంద్ర ప్రభుత్వం మధ్య దీనిపై చర్చలు జరుగుతున్నాయి.అయితే, ఈ ధరల పెంపు శాశ్వతం కాదని తెలుస్తోంది. కేవలం ముడి పదార్థాల కొరత తీరే వరకు, అంటే సుమారు మూడు నెలల కాలానికి మాత్రమే ఈ పెంపును వర్తింపజేసేలా ప్రభుత్వం షరతులు విధించవచ్చని నేషనల్ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. సరఫరా సాధారణ స్థితికి రాగానే తిరిగి పాత ధరలే అమల్లోకి వచ్చేలా ప్లాన్ చేస్తున్నారు.


## నకిలీ పత్తి విత్తనాల గుట్టురట్టు






తాండూర్ : నకిలీ, అనుమతిలేని పత్తి విత్తనాలు, నిషేదిత గడ్డి మందు లాంటివి ఎవరు విక్రయించినా, వారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడ్డ నకిలీ పత్తి విత్తనాల కేసుకు సంబంధించిన వివరాలను బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు.బోయపల్లి బోర్డు జాతీయ రహదారి సమీపంలో ఆటోలో బెల్లంపల్లి నుంచి తాండూర్ కు నకిలీ పత్తి విత్తనాలను దంపు చేస్తున్నారనే సమాచారంతో తాండూర్ ఎస్సై కే ప్రసాద్, వ్యవసాయాధికారిణి సుష్మా, సిబ్బందితో కలిసి వెళ్లి తనిఖీ చేయగా ఆటోలో నకిలీ పత్తి విత్తనాలు లభ్యమైనట్లు గుర్తించారని తెలిపారు. రూ. 3లక్షలు విలువగల 150 కేజీల పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.భీమిని మండలం నారాయణపూర్ గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేస్తు బోయపల్లి బోర్డు గ్రామంలో ఉంటున్న వూస సుబ్బారావు, తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఒగరి సమ్మయ్య, తాండూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మగ్దూంను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇద్దరు కొనుగోలుదారులు నకిలీ పత్తి విత్తనాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా గుంటుపల్లి శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లు డీసీపీ వివరించారు.గ్రామాల్లో ఎక్కడైనా నకిలీ పత్తి విత్తనాలు ఉన్నట్లుగానీ అమ్ముతున్నట్లుగాని సమాచారం తెలిస్తే తెలియజేయాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సమావేశంలో తాండూర్ సీఐ దేవయ్య, ఎస్సై ప్రసాద్, పోలీసు సిబ్బంది, తాండూర్ మండల వ్యవసాయాధికారిని సుష్మ తదితరులు పాల్గొన్నారు.


# తెలుగు రాష్ట్రాల రైలు ప్రయాణికులకు శుభవార్త



హైదరాబాద్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య ప్రయాణించే రైల్వే ప్రయాణికులకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ శుభవార్త అందించింది. ప్రయాణికుల రద్దీ, అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండు కొత్త వారపు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలిపింది. ఇప్పటికే నడుస్తున్న కొన్ని ప్రత్యేక రైళ్లను క్రమబద్ధీకరించడంతో పాటు మరికొన్ని రైళ్ల సేవలను పొడిగించింది. దక్షిణ మధ్య రైల్వే విడుదల చేసిన వివరాల ప్రకారం చర్లపల్లి-నర్సా పురం-చర్లపల్లి (17061/17062) వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును కొత్తగా ప్రకటించారు. ఇది ఇప్పటివరకు నడుస్తున్న ప్రత్యేక రైలు స్థానంలో రెగ్యులర్ సర్వీసుగా నడుస్తుంది. మే 2 నుంచి ప్రతి శనివారం రాత్రి 7:50 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు నర్సాపురం చేరుకుంటుంది.తిరుగు ప్రయాణంలో ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు నర్సాపురంలో బయలు దేరి మరుసటి రోజు ఉదయం 7:50 గంటలకు చర్లపల్లికి వస్తుంది. ఈ రైలు నల్గొండ, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతుంది. అలాగే, నర్సాపురం-తిరుపతి-నర్సాపురం (17428/17427) మధ్య మరో వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును కూడా ప్రవేశపెట్టారు. ఏప్రిల్ 27 నుంచి ప్రతి సోమవా రం సాయంత్రం 3:50 గంటలకు నర్సాపురం లో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 3:40 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మే 3 నుంచి ప్రతి ఆదివారం రాత్రి 10:10 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9:30 గంటలకు నర్సాపురం చేరుకుంటుంది. ఈ రైలు పాలకొల్లు, భీమవరం జంక్షన్, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది.

# లోక్‌సభలో మూడు బిల్లులు..



హైదరాబాద్: పార్లమెంట్ చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన మూడు బిల్లులపై రేపు (శుక్రవారం) సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ జరుగుతుందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఓటింగ్‌కు ముందు బిల్లులపై సుదీర్ఘ చర్చ జరగనుంది.బిల్లులపై చర్చ చేపట్టాలా వద్దా అన్న అంశంపై సభ్యుల మధ్య డివిజన్ జరిగింది. అయితే బిల్లులపై చర్చ చేపట్టాలని 251 మంది ఎంపీలు అనుకూలంగా ఓటేశారు. 185 మంది వ్యతిరేకంగా ఓటేశారు. దీంతో బిల్లులపై చర్చ ప్రక్రియ మొదలైంది. తొలుత ఈ బిల్లులను మోజువాణీ ఓటు ద్వారా పాస్ చేశారు. కానీ విపక్షాల అభ్యంతరం నేపథ్యంలో మళ్లీ విభజన చేసి ఓటింగ్ నిర్వహించారు. 251 మంది అనుకూలంగా ఓటు వేయడంతో.. మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ ప్రక్రియకు చెందిన రాజ్యాంగ సవరణ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. డీలిమిటేషన్, రాజ్యాంగ సవరణ బిల్లులను కలిపి సభలో ప్రవేశపెట్టడాన్ని కాంగ్రెస్ నేత వేణుగోపాల్ వ్యతిరేకించారు. రెండు బిల్లులను కలపడం మంచి విధానం కాదు అని, దీని వల్ల పరిణామాలు ఉంటాయని, ఒకవేళ రాజ్యాంగ సవరణ బిల్లు ఓటమి పాలైతే, అప్పుడు దీంట్లో అర్థం ఏం ఉంటుందని వేణుగోపాల్ అన్నారు

# దేశ టైమ్స్

## సంపాదకీయం

### ఓ మనిషికి, మరణించిన మనిషి ప్రాణం పోయడం మానవత్వానికి ఉన్న గొప్ప గుణంగా భావించాలి...

నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్ మహానగరంలోని ప్రధాన రోడ్లపై నిర్దిష్ట 14 కి.మీ దూరంలోని ఆసుపత్రికి 22 నిమిషాల్లో చేరుకుని ఐదుగురు రోగుల ప్రాణాలను కాపాడిన సంఘటన ఇటీవల చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నవారి అవయవాలను దానం చేస్తుడడం నిత్యం చదువుతూ ఉన్నాం. ఇలాంటి సంఘటనలు 'అవయవ దానం'కు ప్రాణం పోస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఓ మనిషికి, మరణించిన మనిషి ప్రాణంపోయడం మానవత్వానికి ఉన్న గొప్ప గుణంగా భావించాలి. మరణించిన మనిషి తాలూకూ అవయవాలను నిర్దిష్ట సమయంలో మరో మనిషికి అమర్చడంవల్ల ఓ కొత్త జీవితం అందుతుంది. మరణం అంచున ఉండేవారికి రెండవ జీవితాన్ని ప్రసాదించడం 'పునర్జన్మ'గానే భావించాలి. ఇటీవలికాలంలో దేశవ్యాప్తంగా అవయవ దానంపై కొంతసానుకూల వాతావరణం ఏర్పడుతోంది.2013లో అవయవదాతల సంఖ్య 5 వేల లోపు ఉండగా, 2025లో నాలుగు రెట్లు పెరిగి 20 వేలకు చేరింది. దేశవ్యాప్తంగా పన్నెండు వందల కుటుంబాలు అవయవాలు దానం చేసి ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపారు. అత్యధిక అవయవదానం చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ రెండవ స్థానంలో నిలిచింది. ఇది జాతీయ సగటుకన్నా ఎక్కువ కావడం విశేషం. మధుమేహం, అధిక రక్తపోటు తదితర కారణాల వల్ల దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో కిడ్నీ, కాలేయం, గుండె తదితర వ్యాధులకు గురవుతున్న వారి సంఖ్య ప్రతి ఏటా పెరిగిపోతున్నాయి. సరిపడ అవయవాల లభ్యత లేనందువల్ల ఏటా అయిదు లక్షలమంది నిస్సహాయస్థితిలో ప్రాణాలు కోల్పోతున్నారు. మనిషి జీవించినప్పుడు రక్తదానంతో పాటు కిడ్నీ, కాలేయం, గర్భాశయం, గర్భధారణ కణజాలం దానం చేయవచ్చు. బ్రెయిన్‌డెడ్ అయితే మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు, గుండె, గుండె కవాటాలు, పేగులు, క్లోమం, కార్నియా ఇతరులకు ఉపయోగపడుతాయి. గుండె ఆగి మరణించిన వారైతే కళ్లు, చర్మం, గుండె, కవాటాలు, ఎముకలు వంటి కణజాలాలు వంటి అవయవాలు మాత్రమే కాకుండా, మొత్తం శరీరాన్ని కూడా దానం చేయవచ్చు.బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించిన వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలను నిర్దేశిత సమయాల్లో అవసరమైన వారికి అమర్చాలి. ఆలస్యమైతే అవి పాడైపోయే ప్రమాదముంది. ఒక దాత ఎనిమిదిమంది ప్రాణాలను కాపాడటానికి ఆస్కారముంది. అలాగే సహజ మరణం చెందిన కొద్ది నిమిషాల్లో కళ్లు. కణజాలం (టిష్యూ) సేకరించవచ్చు. కానీ, ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం, అపోహల వల్ల అవయవదానం చేస్తున్నవారి సంఖ్య ఆశించినమేరకు పెరగడం లేదు. 2023లో పదివేల మంది మహిళలు జీవించి ఉండగానే అవయవదానం పత్రాలమీద సంతకం చేసినట్లు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ నివేదిక తెలిపింది. పురుషులతో పోల్చితే ఈ సంఖ్య దాదాపు రెట్టింపు. దేశవ్యాప్తంగా ఏటా రోడ్డు ప్రమాదాల్లో ఒకటిన్నర లక్షల మందికిపైగా మరణిస్తున్నారు. సంబంధిత కుటుంబాలకు నచ్చజెప్పి మృతుల్లో కొందరి అవయవాలను మార్పిడి చేసినా అభాగ్యులెందరికో కొత్త ఊపిరి అందుతుంది. కానీ, బ్రెయిన్‌డెడ్ కేసులను సత్వరం గుర్తించడంతోపాటు వారి కుటుంబ సభ్యులను ఒప్పించడంలో నిర్లక్ష్యం నెలకొంటోంది.అవయవ దానం చేసేందుకు ఎవరైనా ముందుకు రావచ్చు. 18 ఏళ్లు పైబడిన ప్రతి వ్యక్తి అవయవదానం కోసం తమ పేరును నమోదు చేసుకోవచ్చు. 18 ఏళ్లలోపు ఉండేవారు తమ అవయవాలను దానం చేయడానికి అతని తల్లిదండ్రులు లేదా సంరక్షకుల అనుమతి ఉండాలి. మరణానంతరం అవయవ దానం కోసం నమోదు చేసుకుంటే, ముందుగా ఆ వ్యక్తిని వైద్యులు తనిఖీ చేస్తారు. ఆ వ్యక్తికి ఉన్న అనారోగ్య సమస్యలను అంచనా వేసి ఏ అవయవాలను దానం చేయవచ్చో తెలియజేస్తారు. తీవ్ర ప్రమాదం లేదా ఏదైనా వ్యాధి కారణంగా కోమాలోకి వెళ్లి, మళ్లీ స్పృహలోకి రాలేని పరిస్థితిలో ఉన్న బాధితుడిని బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారిస్తారు. ఆసుపత్రిలో వెంటిలేటర్ సహాయంతో వారి గుండె ఇంకా కొట్టుకుంటూ, ఇతర ముఖ్య అవయవాలు మాత్రం కొన్ని గంటలపాటు పనిచేస్తూనే ఉంటాయి. వీటిని కుటుంబ సభ్యుల అనుమతితో సేకరించి, బ్లడ్‌గ్రూప్ తదితర అంశాలు సరిపోలిన వారికి నిర్దేశిత సమయంలో అమర్చుతారు.బ్రెయిన్‌డెడ్‌గా ధ్రువీకరించడానికి ఒకరి కంటే ఎక్కువ మంది వైద్యనిపుణులతో కూడిన బోర్డు అనుమతి తప్పనిసరిగా ఉండాలి. అవయవాల సేకరణ, నిల్వ, తరలింపు, వాణిజ్యపరంగా వాటి దుర్వినియోగం వంటివాటిని నియంత్రించడానికి 1994లో మానవ అవయవాలు, కణాల మార్పిడి చట్టం తీసుకువచ్చింది. 2011లో దీనికి సవరణలు చేశారు. అవయవాల సేకరణ, కేటాయింపు, తరలింపును జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ (ఎన్‌ఒటిటిఒ) పర్యవేక్షిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో అవయవ దానానికి 'జీవన్‌దాన్' ఎంతగానో కృషి చేస్తోంది. మరికొన్ని స్వచ్ఛంద సంస్థలూ పాటుపడుతున్నాయి. మరణించిన వ్యక్తుల అవయవ దానాన్ని ప్రోత్సహించేందుకు 2019లో కేంద్రం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఈమేరకు అవయవాల అందుబాటును పెంచాలనేది జాతీయ అవయవ మార్పిడి కార్యక్రమ ఉద్దేశం. జాతీయ, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయి అవయవ, కణజాల మార్పిడి సంస్థలు అవయువాల సేకరణ, పంపిణీకి సంబంధించిన సమన్వయ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నాయి.అవయవాలను అత్యంత తక్కువ సమయంలో సురక్షితంగా అందించడమే దీని ప్రధాన లక్ష్యం. ఈమేరకు ప్రజలు వెబ్‌సైట్ ద్వారా అవయవ దానానికి 'ఎన్‌ఒటిటిఒ'ను తీసుకొచ్చింది. దాత నుంచి సేకరించే అవయవాలను గ్రహీత ఉండే ఆస్పత్రికి చేర్చే ప్రక్రియలో అంబులెన్సులకు ఎలాంటి అడ్డంకులు లేకుండా గ్రీన్‌కారిడార్ పేరిట ప్రత్యేక మార్గాన్ని కల్పించారు. అంతేకాకుండా 'ఒకే దేశం ఒకే విధానం' కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. దీంతో భారతీయులంతా రాష్ట్రాలతో సంబంధం లేకుండా ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. 65 ఏళ్ల గరిష్ట వయోపరిమితిని తొలగించడం వల్ల ఎవరైనా, ఎక్కడైనా గ్రహీతలుగా అర్హులే. ఈ నేపథ్యంలో అవయవ దానంపైన ప్రచారోద్యమం ముమ్మరంగా సాగాలి. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విదార్థులకు అవయవదానంపై అవగాహన కల్పించాలి. ఎవరికైనా అపోహలుంటే తొలగించాలి. సామాజిక మాధ్యమాలు, ఇతరత్రా వేదికల ద్వారా ప్రచారం పెంచాలి. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి.

## తాజ్‌మహల్ తరహాలో చార్మినార్ అభివృద్ధి



హైదరాబాద్: ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను చూసేందుకు సందర్శకులు ఎలా తరలివస్తారో, అలా చార్మినార్‌కు కూడా వచ్చేలా అభివృద్ధి చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. టూరిజం ఎండీ గౌతమి, పురావస్తు, కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు, చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీతో కలిసి చార్మినార్, సర్దార్ మహల్, చౌమహల్లా ప్యాలెస్, గుల్జర్ హౌస్, పత్తర్‌ఘట్టి, లాడ్ బజార్ తదితర ప్రాంతాలను పరిశీలించారు, టూరిజం ప్రమోషన్‌లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక కట్టడాల అభివృద్ధికి కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. కుతుబ్ షాహీ టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు 1.3 కిలోమీటర్ల రోప్‌వే నిర్మాణ ప్రతిపాదనలపై పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరా తీశారు. టూంబ్స్‌లోని ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్‌లో జరుగుతున్న పనులను కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్ మొహియుద్దీన్‌తో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం రోప్ వే పనుల గురించి చర్చించారు. గోల్కొండ కోట సమీపంలోని బస్టాప్ వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో లాడ్ బజార్ తరహాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం కటోరా హౌస్, ఖజానా బిల్డింగ్ మ్యూజియంను సందర్శించారు. ఈ కార్యక్రమంలో టీజీడీసీ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జునరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జులై నుంచి మళ్లీ టారిఫ్‌లు

హైదరాబాద్: ఈ ఏడాది జులై ఆరంభం నుంచి టారిఫ్‌లను పునరుద్ధరించే ఆలోచనలో ఉన్నట్లు అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ తెలిపారు. అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌ల విధానం చట్టవిరుద్ధమని గత ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. తీర్పు తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చినప్పటికీ తగ్గమని స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. ఇందుకోసం సెక్షన్ 301 ఉపయోగించుకోనున్నట్లు తెలిపారు. ఈ చట్టం కింద విధించే సుంకాలకు ఇప్పటికే న్యాయపరమైన గుర్తింపు ఉందన్నారు.

## రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి




చిట్యాల, : రోడ్డు భద్రత నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రం లో రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించి, ప్రయాణికుల భద్రతను మెరుగుపరచడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నల్లగొండ జిల్లా చిట్యా ల మండలం వేలిమినేడు గ్రామ శివారులో జాతీయ రహదారి 65పై నల్లగొండ జిల్లా పోలీస్ యంత్రాంగం ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాదాల అవగాహన హోర్డింగ్‌ను డీజీపీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీజీపీతో పాటు డీఐజీ ఎల్‌ఎస్‌చౌహాన్, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఇతర ఉన్నతాధికారులు ఉ న్నారు. డీజీపీ మాట్లాడుతూ, జాతీయ రహదారులపై నిబంధనలు పాటించకపోవడం వల్లే అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయ ని, ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గూడ్స్ వాహనాల వల్ల జరిగే ప్రమాదాలను అరికట్టేందుకు రేడియం స్టిక్కర్లు తప్పనిసరి అని, రేర్ మార్కింగ్ ప్లేట్స్ కచ్చితంగా ఉండాలని, నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాల ని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ను డీజీపీ ఆదేశించారు. వేలిమినేడు గ్రామ సర్పంచ్ బొంతల చంద్రారెడ్డి డీజీపీ శివధర్ రెడ్డిని కలిసి జాతీయ రహదారి 65పై ఉన్న పిట్టంపల్లి క్రాస్ వద్ద చీకటి కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని,అక్కడ తక్షణమే హైమాస్ట్ లైటింగ్ ఏర్పాటు చేసి వాహనదారుల ప్రాణాలను కాపాడాలని వినతిపత్రాన్ని అందజేశా రు. దీనిపై డీజీపీ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగరాజు, చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ కోసం రూ.2 లక్షల వాచ్

## దొంగతనం చేసిన ప్రియురాలు

హైద్రాబాద్: ప్రేమ అనేది మనిషి జీవితంలో ఒక అందమైన భావోద్వేగం. కానీ అదే ప్రేమ కొన్ని సందర్భాల్లో తప్పుదోవ పట్టించగలదనే విషయాన్ని తాజా ఘటన గుర్తు చేస్తోంది. ప్రేమికుడికి ఖరీదైన బహుమతి ఇవ్వాలనే ఆశతో ఓ యువతి దొంగతనానికి పాల్పడింది. కానీ చివరకు ఆ ప్లాన్ బెడిసి కొట్టి పోలీసుల చేతికి చిక్కింది. ఈ సంఘటన హైదరాబాద్‌లో చోటు చేసుకుంది. చాకచక్యంగా దొంగతనం : జూబ్లీహిల్స్ పోలీసుల సమాచారం ప్రకారం, ఖమ్మం జిల్లా రాజీవ్ గంజ్‌కు చెందిన ఇనవోలు యుక్తశ్రీ (26) ఇటీవల ఉద్యోగం కోసం హైదరాబాద్ నగరానికి వచ్చింది. ఈ క్రమంలో ఆమె జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36లోని ఓ ప్రముఖ వాచ్ షోరూమ్‌ను సందర్శించింది. తన ప్రేమికు డికి గిఫ్ట్ ఇవ్వాలనే ఉద్దేశంతో అక్కడ ఉన్న ఖరీదైన వాచీలను పరిశీలించింది. అయితే, ఆలోచనలో ఉన్నది వేరే. షోరూమ్ సిబ్బంది దృష్టిని మళ్లించిన యుక్తశ్రీ, సుమారు రూ. 2 లక్షల విలువైన టిస్సాట్ బ్రాండ్ వాచీలను చాకచక్యంగా దొంగిలించింది. తర్వాత వాచీలు నచ్చలేదని చెప్పి అక్కడి నుంచి జారుకుంది. సీసీ కెమెరాల ఆధారంగా గుర్తింపు : కొద్దిసేపటి తర్వాత షోరూమ్ సిబ్బంది స్టాక్‌ను పరిశీలించగా వాచీలు కనిపించకపో వడంతో అనుమానం వ్యక్తం చేశారు. వెంటనే సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలించారు. అందులో యుక్తశ్రీ చేసిన చర్యలు స్పష్టంగా కనిపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితురాలిని గుర్తించి, తక్షణమే ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ప్రేమికుడి పాత్ర : పోలీసుల విచారణలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్? నగరంలో ఉద్యోగం చేస్తున్న కొత్త మురళీధర్ గౌడ్ (29) అనే యువకుడితో యుక్తశ్రీకి పరిచయం ఉందని తెలిసింది. అతడికే ఆ ఖరీదైన వాచీలను బహుమ తిగా ఇచ్చినట్లు ఆమె అంగీకరించింది. దీంతో పోలీసులు యుక్తశ్రీతో పాటు మురళీధర్ గౌడ్‌పైనా కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రెండు ఖరీదైన వాచీలను స్వాధీనం చేసుకున్నారు. చట్టపరమైన పరిణామాలు : ఈ ఘటనలో యువతి చేసిన తప్పు ఆమె జీవితంపై తీవ్ర ప్రభా వం చూపే అవకాశం ఉంది. చిన్న భావోద్వే గంతో చేసిన తప్పు, క్రిమినల్ కేసుగా మారి భవిష్యత్తును ప్రభావితం చేయవచ్చు. దొంగతనం వంటి నేరాలకు చట్టపరంగా కఠిన శిక్షలు ఉంటాయని పోలీసులు హెచ్చరిస్తున్నా రు. విలువైనది బహుమతు లు కాదు, పరస్పర నమ్మకం, గౌరవం : ఈ సంఘటన యువతకు ఒక హెచ్చరికలా నిలుస్తోంది. ప్రేమ పేరుతో లేదా ఎమోషన్ వల్ల తప్పు నిర్ణయాలు తీసుకోవడం ఎంత ప్రమాద కరమో ఈ ఘటన తెలియజేస్తోంది. నిజమైన ప్రేమలో విలువైనది బహుమతులు కాదు, పరస్పర నమ్మకం, గౌరవం. తాత్కాలిక కోరికల కోసం చట్ట విరుద్ధ మార్గాలను ఎంచుకోవడం కన్నా, నిజాయితీతో జీవించడం ముఖ్యమని ఈ ఘటన స్పష్టం చేస్తోంది.

## గ్రామీణ యువతకు 'ఐక్యత' భరోసా

కడ్తాల్, : ఆర్థిక ఇబ్బందుల వల్ల నగరాలకు వెళ్లి కోచింగ్ తీసుకోలేని గ్రామీణ నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తోంది ఐక్యత ఫౌండేషన్. పోలీస్ ఉద్యోగాలే లక్ష్యంగా సాగుతున్న యువత కోసం కడ్తాల్ మండల పరిధిలోని కర్కల్పహాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కేంద్రాన్ని టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, కడ్తాల్ సీఐ గంగాధర్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుంకి రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థుల్లో అద్భుతమైన ప్రతిభ ఉంది, కానీ సరైన మార్గదర్శకత్వం, ఆర్థిక స్తోమత లేక వారు వెనుకబడిపోతున్నారు. ఆ లోటును భర్తీ చేయడానికే హైదరాబాద్లోని ప్రముఖ కోచింగ్ సెంటర్లకు ఏమాత్రం తీసిపోని విధంగా, నిష్ణాతులైన అధ్యాపకులతో ఈ ఉచిత శిక్షణను అందిస్తున్నాం' అని తెలిపారు. త్వరలోనే కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉచిత కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే పట్టుదలతో పాటు సమయపాలన ముఖ్యమని యువతకు దిశానిర్దేశం చేశారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ను కూడా ఫౌండేషన్ తరఫున అందజేయనున్నారు. ఆర్థిక స్థోమత లేక ఏ ఒక్క యువకుడు తన కలలను వదులుకోకూడదనేదే మా లక్ష్యం అని సుంకిరెడ్డి పేర్కొన్నారు. కడ్తాల్ సీఐ గంగాధర్, ఎస్సై వరప్రసాద్ మాట్లాడుతూ.. సమాజ సేవలో రాఘవేందర్ రెడ్డి చూపిస్తున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. గ్రామీణ యువత ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోలీస్ శాఖలో ఉన్నత ఉద్యోగాలు సాధించి, సమాజానికి సేవ చేయాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ లు తేజీ రామ్, రామ్ చందర్, అమర్ సింగ్, చిట్టి రమేష్ నాయక్, దాస్ నాయక్, రమేష్ నాయక్ పాల్గొన్నారు. అలాగే విశ్వ అకాడమీ లెక్చరర్లు విశ్వ, బిక్షులతో పాటు స్థానిక నాయకులు జలాల్, సురేందర్, మహేష్, జహంగీర్, రఘు, లింగం, మల్లేష్ నాయక్, నాగేష్ నాయక్ మరియు పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలపై యువతకు అవగాహన

హైద్రాబాద్: రోడ్డు ప్రమాదాలను తగ్గించి, యు వతలో ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన పెంచేందుకు సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం. రమేష్ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా కార్యక్రమం కొత్తగూడ లోని కెఎల్హెచ్ యూనివర్సిటీలో ట్రాఫిక్ అధికారులతో కలిసి విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి డాక్టర్ ఎం.రమేష్ విద్యార్థులతో మాట్లాడుతూ... రోడ్డు భద్రత యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రతి యాత్రికుడు జీవితాన్ని కాపాడు కోవాలి. రోడ్డు ప్రమాదాలు కేవలం వ్యక్తిగత నష్టం కాదు, కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని గుర్తు చేశారు. తమకు లేదా తమ కుటుంబ సభ్యులకు ఎదురైన రోడ్డు ప్రమాదాల అనుభవాలను పంచుకోవాలని, కోరారు. ఈ చర్చల ద్వారా విద్యార్థులు రోడ్డు భద్రత పట్ల మరింత జాగ్రత్తగా ఉంటారని ఆయన పేర్కొన్నారు. సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు శాఖ అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రత, హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకం, డ్రంక్ అండ్ డ్రైవ్ నివారణ వంటి అంశాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. అనంతరం విద్యార్థులు రోడ్డు భద్రతపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ శేరిలింగంపల్లి, అడిషనల్ డీసీపీ ట్రాఫిక్, ఏసీపీ మాధాపూర్ ఇతర ట్రాఫిక్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## నిబంధనలకు అనుగుణంగా అర్హుల ఎంపిక

సిరిసిల్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపె ట్టిన సంక్షేమ పథకాలకు ప్రభుత్వ నింబధనలకు అనుగుణంగా అర్హులను ఎంపిక చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార సంఘ అభివృద్ధి సంస్థ యాక్షన్ ప్లాన్‌పై జిల్లా కమిటీ స్థాయి సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటీవ్ డైరె క్టర్, ఎస్సీ కార్పొరేషన్ ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26కి సంబంధించిన అం శాలు, మండలాల వారీగా లక్ష్యాలను ఆమోదించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్దిదారుల, మండల స్థాయిలో లక్ష్యాల కేటాయిం పు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత సమయంలో చేయా లని సూచించారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పోరేషన్ ఈడీ స్వప్న, జిల్లా పరి శ్రమల శాఖ జీఎం హనుమంతునాయక్, జిల్లా పశు సంవర్ధకశాఖ అధి కారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్‌కుమార్, ఎల్‌డీఎం మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# భానుప్రియ మతిస్థిమితం కోల్పోయిందా?





ఒకప్పుడు తెలుగు సినిమాల్లో ఒక వెలుగు వెలిగిన కథానాయికల్లో భానుప్రియ ఒకరు. 80వ దశకంలో తెలుగులో ఉన్న అందరు అగ్రకథానాయికులతోనూ ఆమె సినిమాలు చేశారు. 'స్వర్ణకమలం' సహా ఎన్నో చిత్రాల్లో తన అందం, అభినయంతో ఆమె కట్టిపడేశారు. ఐతే తర్వాత ఆమెకు అవకాశాలు తగ్గిపోయాయి. కొన్నేళ్లు క్యారెక్టర్ రోల్స్‌లో కనిపించిన భానుప్రియ.. క్రమంగా సినీ రంగానికి దూరం అయిపోయారు. కొన్నేళ్లుగా భానుప్రియ ఆరోగ్యం బాగా లేదని వార్తలు వస్తున్నాయి. ఇటీవల ఆమె పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారిందని.. డిమెన్షియా కారణంగా మతిస్థిమితం కూడా కోల్పోయిందని.. ఎవరినీ గుర్తించే పరిస్థితిలో కూడా లేదని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై భానుప్రియ చెల్లెలు, 'మహర్షి' సహా పలు చిత్రాల్లో నటించిన శాంతి ప్రియ స్పందించారు. భానుప్రియ ఆరోగ్యం బాగా లేని మాట వాస్తవమే అని.. కానీ ఆమె జ్ఞాపక శక్తి కోల్పోయి ఎవరినీ గుర్తించలేని స్థితిలో ఉందంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఆమె స్పష్టం చేసింది. ఇండస్ట్రీ నుంచి ఎవ్వరూ భానుప్రియను పట్టించుకోవడం లేదని.. 80వ దశకం రీ యూనియన్‌కు కూడా తన సోదరిని పిలవట్లేదని శాంతి ప్రియ ఆవేదన వ్యక్తం చేసింది. భానుప్రియ ఫోన్ నంబర్ లేకపోతే తనకు లేదా తమ అన్నయ్యకు ఫోన్ చేసి మాట్లాడొచ్చని.. ఇండస్ట్రీలో అందరికీ ఆయన తెలుసని.. అయినా ఎవ్వరూ భానుప్రియ కోసం సంప్రదించలేదని శాంతి ప్రియ పేర్కొంది. భర్త మరణం తర్వాత భానుప్రియ డిప్రెషన్‌కు గురైందని.. ఆమె కొన్నేళ్లుగా మనోవేదన అనుభవిస్తోందని శాంతిప్రియ చెప్పింది. ఆమెకు కొన్ని సినిమాల్లో అవకాశాలు వచ్చాయని.. కానీ తన పాత్ర గురించి ముందు ఒకటి చెప్పి, తీరా షూట్‌కు వెళ్లాక ఆ పాత్రలను మార్చేయడం వల్ల భానుప్రియ ఎంతో బాధ పడ్డారని.. అందుకే ఆమె సినిమాలకు దూరం అయ్యారని ఆమె చెప్పింది. భానుప్రియ ఇకపై సినిమాల్లో నటించరని.. తాను మాత్రం నటిగా కొనసాగుతానని శాంతి ప్రియ స్పష్టం చేసింది. 'బ్యాడ్ గర్ల్' సినిమాలో తన పాత్రకు భానుప్రియనే డబ్బింగ్ చెప్పిందని.. ఆమె మానసిక స్థితి ఏమీ దెబ్బ తినలేదని.. ఆమె గురించి అసత్యాలు ప్రచారం చేయొద్దని శాంతి ప్రియ కోరింది.

# రాజమౌళి తీరిగ్గా బ్రేక్ తీసుకున్నారంటే..?



దర్శకధీరుడు రాజమౌళి వర్కింగ్ స్టైల్ గురించి ఇండస్ట్రీలో అందరికి తెలిసిందే. సినిమా మొదలుపెడితే అది పూర్తయ్యే వరకు ఆయన వేరే లోకాన్ని చూడరు. హీరోలకు చిన్న గ్యాప్ కూడా ఇవ్వకుండా సెట్ లోనే బంధించేస్తుంటారు. 'మర్యాదరామన్న' లాంటి చిన్న సినిమాకే ఏడాదికి పైగా సమయం తీసుకున్న జక్కన్న, ఇప్పుడు ఏకంగా 1000 కోట్ల భారీ బడ్జెట్ సినిమా విషయంలో తన పాత పద్ధతులను పూర్తిగా పక్కన పెట్టేసినట్లు కనిపిస్తోంది. షూటింగ్ మధ్యలో ఫ్యామిలీతో కలిసి హాలిడే ట్రిప్ ప్లాన్ చేస్తున్నట్లు ఒక లీక్ రాగానే అందరూ షాక్ అవుతున్నారు. సాధారణంగా రాజమౌళి ఏదైనా సినిమా రిలీజ్ అయిన తర్వాతే రిలాక్స్ అవుతారు. కానీ మహేష్ బాబుతో చేస్తున్న ఈ ప్రతిష్టాత్మక అడ్వెంచర్ థ్రిల్లర్ వారణాసి విషయంలో రూటు మార్చారు. ఇప్పటికే దాదాపు 70 శాతం షూటింగ్ చకచకా పూర్తి చేసేశారంటే, పనితీరు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. 2027 సమ్మర్ కు సినిమాను థియేటర్లలోకి తీసుకువస్తానని గతంలోనే మాట ఇచ్చారు. అనుకున్న సమయానికంటే ముందే షూటింగ్ చివరి దశకు చేరుకోవడంతో ఇప్పుడు తీరిగ్గా బ్రేక్ తీసుకుని రీఛార్జ్ అవ్వాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ లోని శంకరపల్లిలో వారణాసి నేపథ్యంలో సాగే ఒక కీలక షెడ్యూల్ జరుగుతోంది. ఇందులో మహేష్ బాబుతో పాటు పృథ్వీరాజ్, ప్రియాంక చోప్రా కూడా పాల్గొంటున్నారు. ఈ షెడ్యూల్ ముగిసిన వెంటనే చిత్ర బృందం ఒక చిన్న బ్రేక్ తీసుకోబోతోంది. రాజమౌళి తన కుటుంబంతో కలిసి విహార యాత్రకు వెళ్తుండగా, మహేష్ బాబు కూడా విదేశాలకు పయనం కానున్నారు. ఇలా హీరోని కూడా వదిలేశారంటే, ప్లానింగ్ విషయంలో రాజమౌళి ఎంత పక్కాగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. జక్కన్న పక్కా బౌండెడ్ స్క్రిప్ట్ తో రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. అంటే ప్రతి సీన్, ప్రతి విజువల్ ముందే పేపర్ మీద లాక్ అయిపోయాయి. అందుకే హాలీవుడ్ రేంజ్ లో సాగే ఈ ఫారెస్ట్ అడ్వెంచర్ షూటింగ్ ఎక్కడా తడబాటు లేకుండా సాగిపోతోంది. గతంలో 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' సినిమాల సమయంలో విజువల్ ఎఫెక్ట్స్ కోసం నెలల తరబడి సమయం తీసుకున్న ఆయన, ఈసారి షూటింగ్ తో పాటే పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా సమాంతరంగా నడిపిస్తున్నట్లు సమాచారం. అందుకే రిలీజ్ కు ఇంకా ఏడాది సమయం ఉన్నా ఆయన ఇంత కూల్ గా కనిపిస్తున్నారు. ఈ సినిమాలో యాక్షన్ బ్లాక్స్ గురించి అప్పుడే రకరకాల చర్చలు మొదలయ్యాయి. వారణాసి లాంటి ఆధ్యాత్మిక నగరంలో ఒక భారీ ఫైట్ సీక్వెన్స్ ను డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. శంకరపల్లిలో వేసిన ఆ సెట్ విజువల్స్ అచ్చం గంగా ఘాట్లను తలపిస్తున్నాయట. మహేష్ బాబును గతంలో ఎన్నడూ చూడని ఒక కొత్త మేకోవర్ లో చూపించబోతున్నారు. పురాణాలకు సైన్స్ ఫిక్షన్ ను జోడించి అడ్వెంచర్ జోనర్ లో ఈ కథను నడిపిస్తుండటంతో, విదేశీ లొకేషన్లు కూడా ఈ సినిమాలో కీలక పాత్ర పోషించబోతున్నాయి. మరి ఈ సినిమాతో రాజమౌళి ఎలాంటి రికార్డులను బ్రేక్ చేస్తారేమో చూడాలి.

# రూ.13 వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలి

సంగారెడ్డి : ఉద్యోగుల ఓపిక, సహనాన్ని ప్రభుత్వం పరీక్షించవద్దని, ప్రభుత్వం బకాయిపడిన రూ.13 వేల కోట్లను వెంటనే చెల్లించాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిలు చెల్లించాలనడం గొంతెమ్మ కోరికలు కావన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లిస్తే వారి ఆశీస్సులు ప్రభుత్వానికి ఉంటాయని తెలిపారు. ఉద్యోగుల హెల్త్ కార్డులపై చర్చలు జరిగినా ప్రభుత్వం ఇప్పటి వరకు సమస్యకు పరిష్కారం చూపలేదని చెప్పారు. పీఆర్‌సీ కమిటీ ఏర్పడి 34 నెలలైనా ఇప్పటికీ నివేదిక ఇవ్వకపోవడం, మరో పీఆర్‌సీ గడువు సమీపిస్తున్నా గత పీఆర్‌సీ అమలు జరగకపోవడం బాధాకరమన్నారు. బకాయిలు ఇవ్వని గత పాలకులను ప్రతిపక్షంలో కూర్చోబెట్టిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన 6 నెలల్లో సీపీఎ?సను రద్దు చేస్తామని చెప్పి కమిటీల పేరుతో కాలయాపన చేయడం సరికాదన్నారు. కొన్ని జిల్లాల్లో కలెక్టర్లు ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఈ నెల 17న నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేపడతామని, మే 5న ఒక రోజు రిలే నిరాహార దీక్ష చే స్తామని చెప్పారు. అయినా ప్రభుత్వం స్పందించకుంటే మరో ఉద్యమానికి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఉద్యోగ, పెన్షనర్ల బకాయిలపై ప్రభుత్వ పెద్దలతో జగ్గారెడ్డి మాట్లాడాలని ప్రధాన కార్యదర్శి ముజీబ్ కోరారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెంకటేశ్, కోశాధికారి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ట్రయల్ కోర్టుల ఎన్వోసీ ఉంటేనే పాస్‌పోర్ట్



హైద్రాబాద్: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. పాస్‌పోర్ట్ దరఖాస్తు వ్యవహారంలో హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయనపై ఉన్న పెండింగ్ క్రిమినల్ కేసుల దృష్ట్యా.. పాస్‌పోర్ట్ పొందాలంటే సంబంధిత ట్రయల్ కోర్టుల నుంచి తప్పనిసరిగా నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ తీసుకోవాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ నాగేశ్ భీమపాక ఆదేశాలు జారీ చేశారు. మంత్రి లక్ష్మణ్ కుమార్ తన పాస్‌పోర్ట్ పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకోగా.. పోలీసు వెరిఫికేషన్ నివేదిక ప్రతికూలంగా రావడంతో పాస్‌పోర్ట్ అధికారులు దానిని తిరస్కరించారు. ఆయనపై పలు క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని పోలీసులు నివేదించడమే దీనికి ప్రధాన కారణం. దీంతో మంత్రి హైకోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించింది. పోలీసు రికార్డుల ప్రకారం మంత్రిపై మొత్తం ఎనిమిది క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీటిలో 3 కేసులు ప్రస్తుతం వివిధ కోర్టుల్లో విచారణ దశలో ఉన్నాయి. మిగిలిన కేసులు దర్యాప్తు దశలో ఉన్నట్లు సమాచారం. ఈ పెండింగ్ కేసుల కారణంగానే పాస్‌పోర్ట్ జారీ ప్రక్రియలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తాయి. మంత్రి పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. విచారణ సాగుతున్న ట్రయల్ కోర్టుల వద్ద ఎన్‌వోసీలు తెచ్చుకొని పాస్‌పోర్టులు పొందవచ్చునని సూచించింది. హైకోర్టు తన తీర్పులో మరో ముఖ్యమైన స్పష్టతనిచ్చింది. విచారణ కోర్టులు ఇచ్చే చీూజ కేవలం పాస్‌పోర్ట్ పొందడానికి మాత్రమే అనుమతిస్తుందని.. అది విదేశాలకు వెళ్లడానికి ఇచ్చే పర్మిషన్ కాదని తేల్చి చెప్పింది. మంత్రి ముందుగా విచారణ కోర్టులలో సరైన దరఖాస్తులు సమర్పించి చీూజ పొందాలని సూచించింది. ఆ ఎన్వోసీని పాస్‌పోర్ట్ అధికారులకు సమర్పించిన తర్వాత.. వారు చట్టబద్ధంగా పాస్‌పోర్ట్ జారీ ప్రక్రియను పరిశీలించాలని పేర్కొంది. ఒకవేళ విదేశాలకు వెళ్లాల్సి వస్తే.. ప్రయాణ ఉద్దేశం, కాలపరిమితిని పేర్కొంటూ మళ్ళీ విడిగానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పింది. ట్రయల్ కోర్టులు ఈ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి తగిన ఉత్తర్వులు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. ప్రయాణ అనుమతులు ఇచ్చే సమయంలో కోర్టులు షరతులు విధించవచ్చునని, ఒకవేళ ఆ షరతులను ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకునే పూర్తి స్వేచ్ఛ ట్రయల్ కోర్టులకు ఉంటుందని హైకోర్టు వెల్లడించింది. చట్టం ముందు అందరూ సమానులేనని, అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు కూడా న్యాయపరమైన నిబంధనలను పాటించాల్సిందేనని హైకోర్టు గుర్తు చేసింది.

# పురుషుల్లో పెరుగుతున్న రొమ్ము క్యాన్సర్ ముప్పు



హైద్రాబాద్: ప్రపంచాన్ని శరవేగంగా కబళిస్తున్న వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా దాదాపు కోటి మందికిపైగా ప్రాణాలు కోల్పోతున్నారు. మన దేశంలోనూ లక్షల సంఖ్యలో కొత్త కేసులు వెలుగు చూస్తున్నాయి. ఒకసారి క్యాన్సర్ బారిన పడితే బయటపడడం చాలా కష్టం. చికిత్స తీసుకుంటూనే మరెన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇక రొమ్ము క్యాన్సర్ అనగానే కేవలం మహిళలకు మాత్రమే వచ్చే వ్యాధిగా సమాజంలో ఒక బలమైన ముద్ర ఉంది. కానీ, పురుషుల్లో కూడా ఈ వ్యాధి ప్రబలుతోందని, అది కూడా ప్రాణాంతకమైన చివరి దశలో బయటపడుతోందని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. హైదరాబాద్ నగరంలోని సనత్‌నగర్ ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ 2019 నుంచి 2025 మధ్య కాలంలో నిర్వహించిన ఒక ప్రత్యేక అధ్యయనంలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈఎస్ఐసీ అధ్యయనంలో పాల్గొన్న 15 మంది రోగుల డేటాను విశ్లేషించగా.. అందులో 60 శాతం మంది థర్డ్ స్టేజ్‌లో, 26.7 శాతం మంది ఫోర్త్ స్టేజ్‌లో ఉన్నప్పుడు మొదటిసారి డాక్టర్‌ను సంప్రదించారు. అంటే సుమారు 87 శాతం మందిలో క్యాన్సర్ శరీరం అంతటా వ్యాపించిన తర్వాతే చికిత్స ప్రారంభమైంది. లక్షణాలు కనిపించినప్పటి నుంచి వ్యాధి నిర్ధారణ అయ్యే వరకు సగటున ఆరు నెలల జాప్యం జరుగుతోందని డాక్టర్లు గుర్తించారు. అధ్యయనంలో పాల్గొన్న రోగులలో చాలా మందికి చనుమొన వెనుక గడ్డలు, చర్మం మట్నుద్దు బారటం, చనుమొన లోపలికి కుంచించుకుపోవడం వంటి లక్షణాలు కనిపించాయి. ఇద్దరు రోగులలోనైతే వ్యాధి తీవ్రత పెరిగి పుండ్లు కూడా పడ్డాయి. ఇటువంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయవద్దని డాక్టర్లు సూచిస్తున్నారు. ఈఎస్ఐసీ ఆంకాలజీ విభాగం హెడ్ డాక్టర్ గుమ్మల్ విశేష్ మాట్లాడుతూ.. ఆయా రోగుల్లో ఎవరికీ ఫ్యామిలీలో క్యాన్సర్ హిస్టరీ, హార్మోన్ల సమస్యలు వంటి ముందస్తు ముప్పు కారకాలు లేవని చెప్పారు. పురుషుల్లో ఈ వ్యాధి అరుదు కావడంతో.. ప్రారంభ లక్షణాలను తప్పుగా అర్థం చేసుకోవడమే ఈ జాప్యానికి కారణమని అంటున్నారు. ఇక 2025లో జరిగిన ఫాలోఅప్ ప్రకారం.. 60 శాతం మంది రోగులు ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారు. ఇద్దరు వ్యాధి తీవ్రతతో మరణించగా.. 26.7 శాతం మంది చికిత్స ఆపేశారు. ఈఎస్ఐసీలో ఉచిత చికిత్స అందుబాటులో ఉన్నప్పటికీ.. సుదూర ప్రయాణాలు, సామాజిక వివక్ష, అవగాహన లోపం వల్ల రోగులు చికిత్సకు దూరమవుతున్నారని డాక్టర్లు చెబుతున్నారు. మహిళల రొమ్ము క్యాన్సర్‌పై ఉన్నంత అవగాహన పురుషుల విషయంలో లేకపోవడం పెద్ద లోపంగా మారిందని అంటున్నారు. పురుషుల కోసం ప్రత్యేకంగా క్యాన్సర్ మార్గదర్శకాలు లేవని వైద్య నిపుణులు చెబుతున్నారు. పబ్లిక్ హెల్త్ మెసేజింగ్‌లో పురుషుల రొమ్ము క్యాన్సర్‌ను కూడా చేర్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల క్యాన్సర్‌ను నోటిఫైబుల్ డిసీజ్‌గా గుర్తించడం వల్ల డేటా సేకరణ మెరుగుపడుతుందని అయితే జాతీయ స్థాయిలో దీనిపై ప్రత్యేక విధానాలు రావాలని నిపుణులు కోరుతున్నారు.

# ప్రపంచ సగటు కన్నా రెట్టింపు వృద్ధితో భారత్

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణం, మందగిస్తున్న ప్రపంచ వృద్ధిరేటు వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా నిలబడుతుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టలినా జార్జివా ప్రశంసించారు. బలమైన పునాదులు, విధానాల కారణంగా చాలా దేశాల కన్నా భారత్ మెరుగైన పనితీరు కనబరుస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఐఎంఎఫ్ స్ప్రింగ్ మీటింగ్స్‌లో భాగంగా బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ రోజు భారత్‌ను చూడండి. ప్రపంచ సగటు వృద్ధి రేటు కంటే రెండు రెట్లకు పైగా అధిక వృద్ధితో భారత్ ముందుకు సాగుతోంది" అని జార్జివా పేర్కొన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా భారత్ చేపట్టిన విధానపరమైన సంస్కరణలు, సంస్థాగత సామర్థ్యాన్ని బలోపేతం చేసుకోవడమే ఈ స్థిరత్వానికి కారణమని ఆమె వివరించారు. బలమైన స్థూల ఆర్థిక చట్రాలు ఉన్న దేశాలు బాహ్య ఒడిదొడుకులను సమర్థవంతంగా తట్టుకుని నిలబడగలవని తెలిపారు. భారత్ సహా అనేక వర్ధమాన దేశాలు తమ విధానాలను, ముఖ్యంగా ద్రవ్య విధానాన్ని గణనీయంగా మెరుగుపరుచుకున్నాయని జార్జివా పేర్కొన్నారు. "ద్రవ్య విధానంలో ఈ దేశాలు అభివృద్ధి చెందిన దేశాల కంటే మెరుగ్గా లేదా వాటికి సమానంగా ఉన్నాయి" అని ఆమె కితాబునిచ్చారు. అయితే, ద్రవ్యోల్బణ విధానంలో మరిన్ని మార్పులు అవసరమని అంగీకరించారు. వర్ధమాన దేశాల ఆర్థిక స్థిరత్వం కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూడా మరింత పటిష్ఠంగా మారిందని ఆమె అన్నారు. అయితే, పశ్చిమాసియాలో సంఘర్షణ సుదీర్ఘకాలం కొనసాగితే అది భారత్‌తో సహా అన్ని ఆర్థిక వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆమె హెచ్చరించారు. ప్రతికూల పరిస్థితులు ఏర్పడితే, ప్రపంచ వృద్ధి 2 శాతానికి పడిపోవచ్చని అంచనా వేశారు. ఇంధనాన్ని దిగుమతి చేసుకునే దేశాలపై దీని ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంటుందని, ముఖ్యంగా గల్ఫ్ నుంచి ఇంధనాన్ని ఎక్కువగా దిగుమతి చేసుకునే ఆసియా దేశాలపై ఈ ఒత్తిడి మరింత ఎక్కువగా ఉంటుందని జార్జివా స్పష్టం చేశారు. ఈ ముప్పులు ఉన్నప్పటికీ, బలమైన దేశీయ డిమాండ్, సంస్థాగత పటిష్ఠత, విధానపరమైన విశ్వసనీయత ఉన్న భారత్ వంటి దేశాలు ఇతర దేశాల కంటే



మెరుగైన పనితీరు కనబరుస్తాయని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి భారత్ విషయంలో ఎలాంటి తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకునే అవకాశం లేదని, అయితే ఆర్థిక స్థిరత్వం అనేది నిరంతరం గమనించాల్సిన కీలక అంశమని ఆమె సూచించారు.

# అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలి

సిరిసిల్ల : వేసవిలో అధికంగా సం భవించే అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించి ఎస్పీ మహే ష్ బీగీతే కోరారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో అగ్నిమా పక వారోత్సవాల కరపత్రాలను అధికారులతో కలిసి ఎస్పీ ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అగ్నిమాపక దళ సిబ్బంది స్మారకార్థం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 20 తేదీ వరకు దేశవ్యాప్తంగా అగ్నిమాపక దళ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజల ను చైతన్యవంతులను చేయడం వారోత్సవాల ఉద్దేశమన్నారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ, అగ్ని ప్రమాదాలు తగ్గించడం ప్రధాన ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, ఎస్ఎఫ్‌వో నరేందర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు తెలంగాణ సర్కార్ శుభవార్త

హైద్రాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం భారీ కార్యాచరణను ప్రకటించింది. పింఛన్ల విస్తరణతో పాటు అత్యాధునిక పరికరాల పంపిణీకి శ్రీకారం చుట్టడం ద్వారా వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు సిద్ధమైంది. రాష్ట్రంలో అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తాజాగా మరో లక్ష మంది దివ్యాంగులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయించినట్లు దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ వీరయ్య వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా ప్రస్తుతం వేచి చూస్తున్న వేలాది మందికి ఆర్థిక భరోసా లభించనుంది. ఇప్పటికే ఉన్న పింఛన్ల వ్యవస్థను మరింత పటిష్టం చేస్తూ, కొత్త లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. దివ్యాంగుల జీవన ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం కేవలం ఆర్థిక సాయానికే పరిమితం కాకుండా, భౌతిక అవసరాలను తీర్చేందుకు ప్రాధాన్యతనిస్తోంది. 40 శాతం మరియు అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి వారు సులభంగా తిరగడానికి, పనులు చేసుకోవడానికి అవసరమైన అడ్వాన్స్డ్ పరికరాలను ఉచితంగా అందజేయనున్నారు. ఇందులో స్మార్ట్ కేన్స్, అత్యాధునిక శ్రవణ యంత్రాలు మరియు వీల్ చైర్స్ వంటివి ఉండనున్నాయి. ఈ పరికరాల ద్వారా దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా తమ పనులు తామే చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. దివ్యాంగుల సాధికారతలో భాగంగా ఇప్పటికే అమలు చేసిన పథకాల వివరాలను ఛైర్మన్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. తొలి విడతలో భాగంగా సుమారు 4,500 ఇందిరమ్మ ఇళ్లను దివ్యాంగుల కోటాలో కేటాయించగా, వారి రవాణా సౌకర్యం కోసం 2,000 స్కూటీలను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. గూడు మరియు నీడ కల్పించడంతో పాటు ఆర్థికంగా, సామాజికంగా దివ్యాంగులు ఎదిగేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

# ఏసీబీకి చిక్కిన హుజురాబాద్ మున్సిపల్ ఏఈ

హుజురాబాద్: కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మున్సిపాలిటీలో ఏఈ సుధాకర్‌రెడ్డి బుధవారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. హుజురాబాద్ మున్సిపాలిటీలో నునం సుధాకర్‌రెడ్డి ఏఈగా ఇటీవలే నియమితులయ్యారు. ప్రొబెషన్ పీరియడ్ పూర్తి కాలేదు. పట్టణంలోని వరంగల్ రోడ్‌లో డ్రెయినేజీ పనులు జరుగుతున్నాయి. కాంట్రాక్టర్ సంతోష్‌కు మొదటి బిల్లు రూ.4లక్షల వచ్చింది. మరో రూ.14లక్షల బిల్లు కోసం ఎంబీ రికార్డు చేయాల్సి ఉంది. ఎంబి రికార్డు చేసి ఉన్నతాధికారులకు బిల్లు పంపడానికి 50వేల రూపాయల లంచం ఇవ్వాలని సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశాడు. అన్ని డబ్బులు ఇచ్చుకోలేమని కాంట్రాక్టర్ చెప్పినప్పటికీ ఏఈ వినకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కాంట్రాక్టర్ సంతోష్ ఏసీబీ అధికారులను సంప్రదించారు. వారి సూచనల ప్రకారం రూ.50వేలు వరంగల్ రోడ్‌లోని ఒక మటన్ షాపు వెనుక తీసుకోవడానికి ఏఈ సుధాకర్‌రెడ్డి ఓకే చెప్పాడు. డబ్బులు తీసుకుంటున్న సుధాకర్‌రెడ్డిని ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నేరం అంగీకరించడంతో అరెస్టు చేసినట్టు ఏసీబీ సీఐ పున్నం చందర్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించగా అనేక విషయాలు బయట పడ్డాయని తెలిపారు.

# అందరి సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం

చిన్న చింతకుంట : అందరి సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యమని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నెల్లికొండి, ఫర్దీపూర్, పల్లమర్రి గ్రామాల్లో ఐకెపి, పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ ఎ-గ్రేడ్ ధాన్యానికి రూ. 2,389, ఎ -గ్రేడ్ ధాన్యానికి రూ. 2,350 మద్దతు ధర నిర్ణయించిందని, దీనికి అదనంగా క్వింటాల్కు రూ. 500 బోనస్ అందజేస్తున్నామని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని కోరారు. అనంతరం ఫర్దీపూర్లో 8 కొత్త ట్రాన్స్ఫార్మర్లను ప్రారంభించి విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం జరుగుతుందన్నారు. గ్రామంలో సిసి రోడ్లు, మక్తల్ వెంకట్ రెడ్డి జ్ఞాపకార్థం నిర్మించిన పాఠశాల షెడ్డును ప్రారంభించి గ్రామ అభివృద్ధికి తమ కట్టుబాటును చాటారు. అనంతరం భూత్పూర్ మండల పరిధిలోని తాడిపర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. పలువురు వివిధ పార్టీల నుంచి చేరిన వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ లోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 'నిబంధనల ప్రకారం డిగ్రీ అడ్మిషన్లు, కోర్సుల నిర్వహణ చేపట్టాలి




నల్లగొండ : యూనివర్సిటీ ఉన్నత విద్యా మండలి మేరకు డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు జరపాలని, నిబంధనలు అతిక్రమించిన కళాశాలలపై చర్యలు ఉంటాయని మహాత్మా గాంధీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. యూనివర్సిటీ పరిధిలో నల్లగొండ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న యూజీబీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్ తో యూనివర్సిటీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిగ్రీ కళాశాలలో నిబంధనల ప్రకారం నిర్వహించాలని, దోస్త్ నియమాల ప్రకారం 25 శాతం కన్నా కోర్సుల్లో విద్యార్థులు తక్కువ ఉంటే కోర్సు రద్దు పరిచి వారిని వేరే గ్రూప్‌లో కానీ వేరే కళాశాలకు కానీ పంపివేయాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాలలోని అడ్మిషన్ ప్రక్రియ విద్యార్థుల సంఖ్యను ఒక్కొక్కటిగా చర్చించి తగు సూచనలు చేశారు. కోర్సుల నిర్వహణకు నాణ్యమైన విద్యను అందించి మెరుగైన మానవ వనరులను అందిం చాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ డా. వై ప్రశాంతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆడిట్ సెల్ అసిస్టెంట్ డైరెక్టర్ డా.ఎం. జయంతి, కోఆర్డినేటర్ సమరీన్ ఖాజ్మీ, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

# వందే భారత్ స్టైల్ లోకల్ రైలు



హైద్రాబాద్: లోకల్ రైళ్ల రంగంలో కొత్త విప్లవానికి నాంది పలుకుతోంది. సెమీ హైస్పీడ్ Vande Bharat Express తరహాలో అత్యాధునిక సౌకర్యాలతో రూపొందించిన తొలి నాన్-ఏసీ లోకల్ రైలు ముంబైకి చేరుకుంది. ఈ రైలును చెన్నైలోని Integral Coach Factory అభివృద్ధి చేసింది.ముంబై లోకల్ రైళ్లలో సాధారణంగా తెరిచి ఉండే తలుపులు, ఫుట్‌బోర్డ్ ప్రయాణాలు ప్రమాదాలకు కారణమవుతున్న విషయం తెలిసిందే. ప్రతి సంవత్సరం ఇలాంటి ఘటనల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా 2025లో ముంబ్రా సమీపంలో జరిగిన ప్రమాదం తర్వాత రైల్వే శాఖ భద్రతపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో కొత్తగా రూపొందించిన రైలులో ఆటోమేటిక్ డోర్ సిస్టమ్‌ను అమలు చేశారు. వందే భారత్ తరహాలో తలుపులు పూర్తిగా మూసిన తర్వాతే రైలు కదిలే విధంగా వ్యవస్థను రూపొందించారు. దీంతో ప్రమాదకరమైన తలుపుల వద్ద ప్రయాణించే సంస్కృతికి అడ్డుకట్ట పడనుంది.నాన్-ఏసీ కోచ్‌లో తలుపులు మూసినప్పుడు ఉక్కపోత పెరుగుతుందనే ఆందోళనను తగ్గించేందుకు ప్రత్యేక సాంకేతిక మార్పులు చేశారు. హై-కెపాసిటీ బ్లోయర్లను అమర్చి గంటకు సుమారు 10,000 క్యూబిక్ మీటర్ల తాజా గాలిని లోపలికి పంపేలా రూపొందించారు. అదనంగా, కిటికీల వెడల్పును 900 మిమీ నుంచి 1,900 మిమీ వరకు పెంచారు. దీనివల్ల ప్రయాణికులకు మెరుగైన వెలుతురు, విస్తృత వీక్షణ లభిస్తుంది. తలుపుల వద్ద ఏర్పాటు చేసిన లౌవర్స్ కారణంగా తలుపులు మూసి ఉన్నప్పటికీ గాలి ప్రసరణ నిరంతరం కొనసాగుతుంది.ప్రయాణికుల అనుభవాన్ని మెరుగుపరచేందుకు మరిన్ని ఆధునిక ఫీచర్లు కూడా జోడించారు. ఒక కోచ్ నుంచి మరొక కోచ్‌కు సులభంగా వెళ్లేందుకు వెస్టిబ్యూల్ సౌకర్యం కల్పించారు. ఇది రద్దీని సమానంగా పంపిణీ చేయడంలో సహాయపడుతుంది. సీట్ల మధ్య లెగ్‌రూమ్ పెంచి మరింత సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించారు. అలాగే తదుపరి స్టేషన్ల వివరాలు, భద్రతా సూచనలను చూపించే డిజిటల్ డిస్‌ప్లేలను ఏర్పాటు చేశారు.ప్రస్తుతం 12 కోచ్‌లతో కూడిన ఈ రైలు ముంబైలోని కుర్లా కార్ షెడ్‌కు చేరుకుంది. భద్రతా ప్రమాణాల పరీక్షల కోసం =వంమ్ఖుతీఎష్త్ర ఐవంఅస్త్రఅం ఖఅఎ Standards Organisation ట్రయల్స్ నిర్వహించనుంది. అన్ని పరీక్షలు పూర్తై అనుమతులు లభించిన తర్వాత ఈ 'వందే భారత్' స్టైల్ లోకల్ రైలు ముంబై ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది.

# హైదరాబాద్‌కు మరో గ్లోబల్ కంపెనీ..

హైద్రాబాద్: అమెరికాకు చెందిన ప్రముఖ ఫార్చ్యూన్ 500 సంస్థ 'ఎల్‌పీఎల్ ఫైనాన్షియల్' తన మొట్టమొదటి అంతర్జాతీయ కేపబిలిటీ సెంటర్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించింది. సుమారు 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా రానున్న రోజుల్లో 1500 మంది టెకీలను నియమించుకోనుంది. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఈ సెంటర్‌ను ప్రారంభించారు. హైదరాబాద్‌లో ఇప్పటికే 450కి పైగా జీసీసీలు ఉండగా.. ఎల్‌పీఎల్ రాకతో నగరం గ్లోబల్ ఫైనాన్షియల్ హబ్‌గా మరింత బలోపేతం కానుంది.హైదరాబాద్ మహా నగరం గ్లోబల్ టెక్నాలజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్ హబ్‌గా మరో ఘనతను సాధించింది. ఎల్‌పీఎల్ ఫైనాన్షియల్ సంస్థ అమెరికా వెలుపల తన మొట్టమొదటి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ను హైదరాబాద్‌లో ప్రారంభించింది. అత్యాధునిక సాంకేతికత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆపరేషన్లను బలోపేతం చేసే లక్ష్యంతో ఈ సంస్థ నగరంలో భారీగా పెట్టుబడి పెడుతోంది. నగరంలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఐదు అంతస్తుల్లో సుమారు 3 లక్షల చదరపు అడుగుల స్థలంలో ఎల్‌పీఎల్ ఫైనాన్షియల్ సంస్థ కార్యాలయాన్ని ఓపెన్ చేసింది. రానున్న కొన్ని రోజుల్లో ఈ కేంద్రం ద్వారా 1500 మందికి పైగా నిపుణులను నియమించుకోవాలని సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రస్తుతం తాత్కాలిక భవనంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ సంస్థ.. 2027 ప్రారంభం నాటికి తన శాశ్వత కార్యాలయంలోకి మారనుంది. ఈ ఏడాది చివరి నాటికి 680 నుండి 700 మంది ఉద్యోగులను భర్తీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.ఈ కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు.. హైదరాబాద్ ప్రస్తుతం సుమారు 450 జీసీసీలకు నిలయంగా మారిందని చెప్పారు. ఇవి 1.3 లక్షల అత్యున్నత స్థాయి సాంకేతిక ఉద్యోగాలను సృష్టించాయని పేర్కొన్నారు. కేవలం గత ఏడాది కాలంలోనే 80 కొత్త జీసీసీలు నగరానికి రావడం విశేషమని ఆయన వెల్లడించారు. ఎల్‌పీఎల్ ఫైనాన్షియల్ వంటి ఫార్చ్యూన్ 500 సంస్థ రాకతో హైదరాబాద్ స్థానం ప్రపంచ ఆర్థిక సేవల రంగంలో మరింత పదిలమైందని మంత్రి కొనియాడారు.ఎల్‌పీఎల్ ఫైనాన్షియల్ సీటీవో గ్రెగ్ గేట్స్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను ఎంచుకోవడానికి ప్రధాన కారణం ఇక్కడి అద్భుతమైన టాలెంట్ అని స్పష్టం చేశారు. ఈ కేంద్రం టెక్నాలజీ, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, డేటా అనలిటిక్స్, రిస్క్ మేనేజ్‌మెంట్‌లో అమెరికా కార్యకలాపాలకు మద్దతుగా నిలుస్తుందని ఎల్‌పీఎల్ ఇండియా హెడ్ రమేష్ కాజా వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా 32 వేల మంది అడ్వైజర్లకు సేవలందిస్తూ.. సుమారు 2.4 ట్రిలియన్ల విలువైన ఆస్తులను నిర్వహిస్తున్న ఈ సంస్థకు హైదరాబాద్ కేంద్రం అత్యంత కీలకం కానుందని చెప్పారు.

## బైక్ పై ప్రయాణం.. 4 ఏళ్ల పిల్లలకూ

# తప్పనిసరిగా హెల్మెట్: సీపీ సజ్జనార్ వార్నింగ్




హైద్రాబాద్: ఇటీవలికాలంలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం ఓవర్ స్పీడ్. ఆ తర్వాత డ్రైవింగ్ చేసేటప్పుడు ఫోన్ మాట్లాడటం, మద్యం తాగి బండి నడపడం, ట్రాఫిక్ రూల్స్ ను పాటించకపోవడం లాంటి వాటితో వరుసగా ప్రమాదాలు నమోదవుతున్నాయి. ఇక తెలంగాణ ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అరైవ్ అలైవ్ అనే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇక తాజాగా 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' లో భాగంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా.. 'బాలల రహదారి భద్రతా దినోత్సవం' పురస్కరించుకుని బంజారా హిల్స్ అగ్రసేన్ కూడలి వద్ద చిన్నారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే 4 ఏళ్లు పైబడిన పిల్లలకు తప్పనిసరిగా హెల్మెట్ ధరింపజేయాలని ఈ సందర్భంగా కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ నగరాన్ని ప్రమాద రహిత నగరంగా తీర్చిదిద్దడంలో రోడ్డు సేఫ్టీ కమిటీ సభ్యుల పాత్ర అత్యంత కీలకమని సజ్జనార్ పేర్కొన్నారు. రహదారి ప్రమాదంలో ఇంటి యజమాని మరణిస్తే ఆ కుటుంబం మొత్తం వీధిన పడుతుందని.. అటువంటి విషాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. వాహనదారులు ఇళ్ల నుంచి బయటకు వచ్చేటప్పుడే భద్రతా నియమాలను ఒక పవిత్రమైన క్రతువులా పాటించాలని సూచించారు. అసోసియేషన్లు తమ ప్రాంగణాల్లో 'నో హెల్మెట్ – నో ఎంట్రీ' బోర్డులను ఏర్పాటు చేసి, నిబంధనలను కఠినంగా అమలు చేయాలన్నారు. స్థానిక ట్రాఫిక్ సమస్యలను వాట్సాప్ గ్రూపుల ద్వారా అధికారుల దృష్టికి తీసుకువస్తే, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రోడ్డు ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడే వారికి కేంద్ర ప్రభుత్వం 'రహ్ వీర్' స్కీం ద్వారా నగదు పురస్కారంతో పాటు చట్టపరమైన రక్షణ కల్పిస్తోందని, ఎవరూ భయపడకుండా బాధితులకు సాయం చేయాలని పిలుపునిచ్చారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీస్ శాఖ బాధ్యత మాత్రమే కాదని, అది ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని గుర్తు చేశారు. మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వాడటం వంటి చర్యలు ప్రాణాంతకమని హెచ్చరించారు.

## కోహెడలో ఆసియాలోనే

# అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ మార్కెట్



హైద్రాబాద్: హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ గ్రామంలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అంతర్జాతీయ పండ్ల మార్కెట్ ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ మార్కెట్ హబ్‌గా అవతరించడానికి రెడీ అవుతోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన క్షేత్రస్థాయి సర్వే పనులు విజయవంతంగా పూర్తి కావడంతో.. పనుల నిర్మాణానికి సంబంధించి త్వరలోనే టెండర్లు పిలుస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. 200 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో సుమారు రూ. 1000 కోట్ల అంచనా వ్యయంతో వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఈ గ్లోబల్ గ్రీన్ మార్కెట్ కేవలం పండ్లకే కాకుండా పూలు, డ్రై ఫ్రూట్స్, పాల ఉత్పత్తులు, సీఫుడ్స్ వంటి వాటిని ఎక్స్‌పోర్టు చేయనున్నాయి.ఈ మార్కెట్ ప్రాంగణంలో అత్యాధునిక సౌకర్యాలు ఏర్పాటు కానున్నాయి. ఎగుమతులకు వీలుగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్వాలిటీ టెస్టింగ్ లాబొరేటరీలు, సుమారు 400 రిటైల్ అవుట్‌లెట్లు, 4 భారీ వేలం హాళ్లు నిర్మించనున్నారు. పండ్లు దెబ్బతినకుండా ఉండేలా అత్యాధునిక కోల్డ్ స్టోరేజ్, ప్రాసెసింగ్ యూనిట్లు ఉంటాయని మంత్రి తుమ్మల వెల్లడించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పక్కనే ఉండటం వల్ల రవాణా సౌకర్యం ఈ మార్కెట్‌కు అతిపెద్ద బలమని చెప్పారు. కొత్తపేట మార్కెట్ తరలింపు తర్వాత ప్రస్తుతం బాటసింగారంలో కొనసాగుతున్న తాత్కాలిక వ్యాపార కార్యకలాపాలన్నీ.. కోహెడ పనులు పూర్తికాగానే ఇక్కడికి షిఫ్ట్ కానున్నట్లు చెప్పారు. దీనివల్ల దళారీల ప్రమేయం తగ్గి రైతులకు గిట్టుబాటు ధర లభించడమే కాకుండా.. వేల సంఖ్యలో నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు.ఇక తెలంగాణ వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో మౌళిక వసతులు కల్పించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. టార్పాలిన్‌లు, తేమ శాతం కొలిచే పరికరాలు, క్లీనింగ్ డ్రైయర్ల వంటి సామగ్రిని సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో రైతుల ఉత్పత్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మార్కెట్ యార్డుల్లో జీరో బిజినెస్ చేసేవారి లైసెన్స్‌లను రద్దు చేయాలన్నారు. ఇలా వ్యాపారం చేయటానికి ఎవరైనా అధికారులు సహకరిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మార్క్‌ఫెడ్ కేంద్రాల్లో మొక్కజొన్నలను విక్రయించే రైతుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తామని స్పష్టం చేశారు. యార్డుల్లో రైతుల సౌకర్యార్థం చేపట్టే అభివృద్ధి పనుల కోసం ఇతర శాఖల నుంచి ఇంజినీరింగ్ అధికారులను డిప్యుటేషన్‌పై తీసుకోవాని మంత్రి తమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

## పటాన్ చెరు లో భారీ మోసం

పటాన్ చెరు : ఐదు లక్షల రూపాయలు పెట్టుబడి పెడితే నెలకు 25 వేల రూపాయల చొప్పున 40 నెలల పాటు చెల్లించడంతోపాటు నూట పది గజాల స్థలం ఇస్తామంటూ వినియోగదారులను నిండా ముంచిన సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పట్టణంలో చోటు చేసుకుంది. తమకు న్యాయం చేయాలంటూ బాధితులు మీడియా ముందు వాపోయారు. బుధవారం పటాన్ చెరు పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తమ గోడును వెళ్లబోసుకున్నారు.పటాన్ చెరు పట్టణంలో గత 20 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న హేమకాంత్ రెడ్డి గత ఏడు సంవత్సరాలుగా వెస్టీజ్ అనే గొలుసుకట్టు సంస్థలో చేరి వందలాది మందిని సభ్యులుగా చేర్చి లక్షల రూపాయలు గడించాడు. కోట్ల రూపాయలు సంపాదించాలన్న దురుద్దేశంతో తనను నమ్మిన సభ్యులను మోసం చేసేందుకు కొత్త పథకాన్ని ప్రారంభించాడు.2025లో శుభక్షేత్ర ప్రాజెక్ట్ పేరుతో తన పథకాన్ని ప్రారంభించాడు. ఐదు లక్షల రూపాయలు పెట్టుబడి పెడితే నెలకు 25 వేల రూపాయల చొప్పున 42 నెలలు చెల్లించడంతో పాటు నారాయణఖేడ్ సమీపంలోని దామరగిద్ద గ్రామంలో 102 గజాల ప్లాటు ఇస్తానని నమ్మబలికాడు. అంతేగాక కట్టినవారు మరొకరి చేత ఐదు లక్షల రూపాయలు కట్టిస్తే 5 వేల రూపాయల చొప్పున కమిషన్ చెల్లిస్తానని నమ్మబలికారు.తమతో కలిసి పనిచేసిన వ్యక్తి కావడంతో 32 మంది బాధితులు ఒక కోటి 60 లక్షల రూపాయలు పెట్టుబడిగా పెట్టారు. కొన్ని నెలలు ప్రతినెలా కమిషన్ చెల్లిస్తూ తదనంతరం సాకులు చెబుతూ తప్పించుకుంటూ తిరగడం ప్రారంభించాడు. అనుమానం వచ్చి ఇంటికి వెళ్లి నిలదీస్తే ఏకంగా మకాం మార్చేసాడు. ఇదిలా ఉండగా పటాన్ చెరుతో పాటు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సుమారు 130 మంది నుండి 7 కోట్ల రూపాయలు వరకు డిపాజిట్లు సేకరించి తప్పించుకొని తిరుగుతున్నాడని బాధితులు తెలిపారు. తమకు ఎలాగైనా న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఈ కేసుకి సింగర్ మంగ్లీ కి ఎటువంటి సంబంధంలేదని, అంతా హేమకాంత్రెడ్డి నేతృత్వంలోనే మోసం జరిగిందని వారు తెలిపారు.

## తల్లిపాలతో రొమ్ము క్యాన్సర్ నిర్మూలన

ఆలేరు :జన్మించిన బిడ్డకు పాలు ఇవ్వడంతో మహిళలు రొమ్ము క్యాన్సర్‌ను నిర్మూలించొచ్చునని సిడిపిఓ స్వరాజ్యం అన్నారు. ఆలేరులో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో పోషణ పక్వాడ 9 నుండి 23 కార్యక్రమంలో భాగంగా, సిడిపిఓ స్వరాజ్యం, తహసిల్దార్ వి. ఆంజనేయులు, మండల అభివృద్ధి అధికారి సత్య ఆంజనేయ ప్రసాద్‌తో కలిసి గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు.ముఖ్య అతిదిగా ఆలేరు మున్సిపలి చైర్మన్ బిజన బాలమణి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిడ్డ ఎదుగుదలకు తలి పాలు ప్రముఖ పాత్ర వహిస్తుందని, గర్భణీలు తగు ఆహార జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డెలివరీ తర్వాత శిశువుకు ముర్రుపాలు, ఆరు నెలల వరకు తల్లి పాలు పట్టించాలని తెలియజేశారు. ఆరు నెలల నిండిన వెంటనే అనుబంధ పోషకాహారం అందించాలని, రెండు సంవత్సరాల వరకు తల్లి పాలు శిశువుకు ఇవ్వడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని, బిడ్డకి బిడ్డకి ఎడం ఉంటుందని తెలియజేశారు. అంగన్వాడిలో అందిస్తున్న పోషకాహారం బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీవో సత్య ఆంజనేయ ప్రసాద్, 2వార్డు కౌన్సిలర్ మరియమ్మ, ఏపీఎం సత్యనారాయణ, సూపర్వైజర్ ఆండాలు, జ్యోతి, అంగన్వాడి టీచర్స్, గర్భవతులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో జీవించాలి

హైద్రాబాద్: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో జీవించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. సరూర్ నగర్ లోని జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం (డీడీ ఆర్సీ కేంద్రం)లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో దివ్యాంగు లకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, కందు కూరు ఆర్డీవో ఎన్.జగదీశ్వరరెడ్డి, సరూర్ నగర్ తహసీల్దార్ వేణుగోపాల్, సరూర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గీత, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధి మిట్టల్, నోడల్ అధికారి (డీడీఆర్సీ) రమేశ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు అనేక పథకాలు అమలు చేస్తున్నదని తెలిపారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్‌లోని జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State,
Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State.
Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280